క్లుప్తంగా

హరీశ్‌రావుకు ఆహ్వానం



పత్రికను అందజేస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని ముద్దాపూర్‌లో జరిగే ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మ, పెద్దిరాజుల విగ్రహప్రతిష్ఠ మహోత్సవానికి రావాలంటూ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. గ్రామాధ్యక్షుడు రిప్పల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ వేడుకల్లో గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి శివాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. లక్ష్మణశర్మ నేతృత్వంలో పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. వైభవంగా జరిగిన ఆదిదంపతుల కల్యాణోత్సవంలో పురప్రముఖులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మద్యం సేవించి నడపొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలకృష్ణ

చిన్నకోడూరు(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఎస్‌ఐ బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, వాహనదారులకు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'స్వయం పరిపాలన'



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి ఉన్నత పాఠశాలల్లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సంబరాజు పద్మ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు అడిగితే అరెస్టులా..



బాలనర్సు

బెజ్జంకి(సిద్దిపేట): దళిత బంధు మంజూరు చేయాలని కోరుతూ సీఎంను కలవడానికి వెళ్లిన దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేశ్‌ను అరెస్టు చేయడం తగదని ఆ కమిటీ సలహాదారు దీటి బాలనర్సు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులు ఫ్రీజ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

యోగాతోనే ఆరోగ్యం

సిద్దిపేటజోన్: ఆరోగ్యవంతమైన జీవితం యోగాద్వారానే సాధ్యమని, ప్రతి ఒక్కరూ యోగా ఆచరించాలని పబ్లిక్ సర్వెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి కోమండ్ల విక్రమ్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎన్జీఓ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఎన్జీఓ భవన్‌లో పతంజలియోగా సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 5 నుంచి తరగతులు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



ఇళ్ల ముందు నిలిచిన మురుగు



పాములపర్తిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- నగం నగం నిర్మించిన డ్రైనేజీలు
- రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం
- రోగాల బారిన పడుతున్న గ్రామస్తులు

గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతోంది. వీధుల్లో ఇళ్ల ముందే మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు వ్యాధులతో బాధలు పడుతున్నారు.

మర్కూక్(గజ్వేల్):

గ్రామస్తులు తమ ఇబ్బందులపై ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి సంవత్సరం కావస్తున్నా అధికారులు మాత్రం గ్రామాలలోని సమస్యలను పట్టించుకోవడంలేదు. మర్కూక్ మండలంలో 16 పంచాయతీలు ఉన్నాయి. పాములపర్తి మండలంలోనే మేజర్ పంచాయతీ. ఈ గ్రామంలో సుమారు 5వేలు మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వం గతంలో లక్షలు వెచ్చించి డ్రైనేజీలు నిర్మించింది. ఆ నిర్మాణం సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దానికి తోడు కొన్ని నెలల నుంచి శుభ్రం చేయడంలేదని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శి, ఎంపీడీఓకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు

మురుగునీరు వీధుల్లో నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో రోగాల భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీలు నిర్మించినా వాటిని పట్టించుకోలేదని, ఈ ప్రభుత్వంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడంలేదు



కొన్ని నెలల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయక పోవడంతో అవి నిండిపోయి మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దుర్గంధం వెదజల్లడంతో దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. దీంతో ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొంది. చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– రాజయ్య, పాములపర్తి గ్రామస్తుడు

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం

గ్రామాలలో మురుగునీటి సమస్య ఉండటం వాస్తవమే. గ్రామాల అభివృద్ధికి నిధులు రావడంలేదు. దీంతో కాంట్రాక్టర్ డ్రైనేజీల నిర్మాణం సక్రమంగా పూర్తిచేయలేదు. మరో కాంట్రాక్టర్‌కు ఇవ్వడం కుదరదు కాబట్టి తీర్మానం చేయించి త్వరలోనే మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తాం. మురుగు కాల్వల దగ్గర పైపులు బిగించి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తా.

– ఎంపీడీఓ అఫ్జలొద్దీన్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఏసీపీ పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్): తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ పురుషోత్తంరెడ్డి హెచ్చరించారు. మండలంలోని వంటిమామిడిలోని ఆర్వీఎమ్ మెడికల్ కళాశాలలో మంగళవారం ర్యాగింగ్, ఇతర చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం 1997నుంచి అమలులోకి వచ్చిందన్నారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు పాల్పడి బంగారు భవిష్యత్ కోల్పోవద్దని సూచించారు. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా విద్యార్థులంతా స్నేహపూర్వకంగా ఉండాలని చెప్పరు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను 100కు తెలియజేసి పోలీసుల సహాయం పొందవచ్చని, విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడితే 6 నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు కళాశాల నుండి సస్పెండ్ చేసే అధికారం ప్రిన్సిపాల్‌కు ఉంటుందని తెలిపారు. సిగరెట్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ యాకయ్య, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మోదీ



మాట్లాడుతున్న మల్లారెడ్డి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): దేశంలోని కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ కొమ్ము కాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. మండలంలోని తాజ్‌గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ ఆరో మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల గారడీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నారని, ఆర్‌ఎస్‌ఎస్ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు రూ.150 లక్షల కోట్లను కేటాయించి కాంగ్రెస్ దోచుకుంటుందని మండిపడ్డారు. కార్యకర్తలు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, చెట్టిపల్లి సత్తిరెడ్డి, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, వెంకట్‌మావో తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాలిస్తే తీవ్ర నష్టం

ఏఓ ప్రగతి



ములుగు(గజ్వేల్): రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రగతి

ములుగు(గజ్వేల్)/కోహెడరూరల్(హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్): ములుగు మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి ప్రగతి రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలు కాలిస్తే భూమికి మేలుచేసే సూక్ష్మజీవులు చనిపోవడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోతాయని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పృథ్వి, రైతులు పాల్గొన్నారు. వరి కొయ్యలను దహనం చేయడం వల్ల తీవ్ర నష్టాలు ఉంటాయని ఏఈఓ ప్రణీత అన్నారు. మండలంలోని వరికోలు గ్రామంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికొయ్య కాల్చడం వల్ల జరిగే నష్టాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై వివరించారు. అలాగే మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో ఏఈఓ శివకుమార్ రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో ఏఓ రామకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం తగ్గుతుందన్నారు. వరి కొయ్యలను మట్టిలో కలిపితే అది సహజ సేంద్రియ ఎరువుగా మారుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హానికర చెత్తను వేరు చేయాలి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్

సిద్దిపేటకమాన్: మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని పరిశీలించారు. హానికర చెత్తను వేరు చేయకుండా ఇవ్వడాన్ని గుర్తించిన ఆయన శానిటేషన్ ఏజేన్సీ నిర్వాహకులకు రూ.50వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. హానికర చెత్తను వేరుచేసి ఇవ్వాలని గతంలో రెండు సార్లు సూచించినప్పటికీ చెత్తను వేరు చేయకపోవడంతో జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

నీటి సరఫరాకు అంతరాయం

సిద్దిపేటజోన్: మానేరు పైపులైన్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం కొన్ని వార్డుల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలారం గ్రామం వద్ద పైపులైన్‌కు ఏర్పట్ట లీకేజీ వద్ద నిర్వహిస్తున్న మరమ్మతుల వల్ల పట్టణంలోని 17 నుంచి 21 అలాగే 36, 37 వార్డుల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.10వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఐక్య పోరాటం చేయాల్సిందే

సిద్దిపేటకమాన్: ఆర్థిక, సామాజిక, రాజకీయరంగాల్లో వెనకబడిపోతున్న బీసీలు అభివృద్ధి చెందాలంటే ఐక్య పోరాటం చేయాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేశ్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించడం లేదన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సాధికారత కోసం 25న హైదరాబాద్‌లో సమరభేరి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిరణ్, స్వామి, మల్లేశం, కవిత తదితరులు పాల్గొన్నారు.

యువత గంజాయికి దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సిద్దిపేటఅర్బన్: యువత గంజాయికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి సూచించారు. అర్బన్ మండలం మిట్టపల్లి, పొన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సేవించినా, రవాణా చేసినా, ఇతరులకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారి సమాచారం ఎక్సైజ్ అధికారులకు తెలపాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐలు విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు బాలమణి, రవి, మౌనిక, స్వాతి, మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

మద్దూరు(హుస్నాబాద్): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నమోదులో పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని నియోజకవర్గ సర్వే ప్రత్యేక అధికారి శ్రీరామ్‌రెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. సర్వే జరిగిన విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మద్దూరు, దూళ్మిట్ట తహసీల్దార్లు మహమ్మద్ రహీం, మధుసూదన్, ఎంపీడీఓ రామ్మోహన్, ఆర్‌ఐలు రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్



ఆయిల్‌పామ్‌ను పరిశీలిస్తున్న బాబూనాయక్

కొండపాక(గజ్వేల్)/దుబ్బాకరూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్ సూచించారు. మండలంలో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్ పామ్‌ను ఒకసారి సాగుచేస్తే 30యేళ్ల పాటు లాభాలు పొందవచ్చన్నారు. మొక్కలు నాటడానికి ఈజీఎస్ పథకంలో కూలీలను వాడుకోవచ్చని, సబ్సిడీపై పరికరాలు పొందవచ్చని చెప్పారు. సాగుచేసిన నాటి నుంచి మూడేళ్ల వరకు రూ.4,500ల చొప్పున ప్రభుత్వం రైతు ఖాతాలో జమచేస్తుందని, నాలుగో ఏట నుంచి పంట దిగుబడులు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే మిరియాలు, తమలపాకు లాంటివి అంతర పంటలుగా వేసుకొని లాభాలు పొందొచ్చని సూచించారు. ఆయిల్‌పామ్ గింజలకు మార్కెట్లో టన్నుకు రూ.19వేల ధర పలుకుందని, సాగులో నీటి తడులు, శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓలు శివరామకృష్ణ, గోవిందరాజు, ఏఈఓలు మౌనిక, సంధ్య తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకరూరల్ మండలంలోని హబ్సిపూర్, చిట్టాపూర్ గ్రామాల రైతులకు హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, ఉద్యానవనశాఖ అధికారి రమేశ్, సత్యస్వేష్ మాట్లాడారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానాభివృద్ధి

చేర్యాల(సిద్దిపేట): పుస్తక పఠనంతోనే పిల్లల్లో జ్ఞానం వృద్ధి చెందుతుందని, పిల్లల మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని కడవేర్గు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు అన్నారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల గ్రంథాలయాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. విద్యార్థులు బాలసాహిత్యాన్ని చదవాలని తెలుగు ఉపాధ్యాయుడు గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ సూచించారు. అనంతరం ఇటీవల 'పత్తిపాక ఫౌండేషన్-గరిపెల్లి ట్రస్ట్' ద్వారా నిర్వహించిన 'అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం రండి' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బాలల దినోత్సవ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, కృష్ణమూర్తి, రామకృష్ణ, లింగయ్య, మమత, అరుణ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయాలను కొనసాగిద్దాం



సిద్దిపేటజోన్: వేడుకల్లో పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తదితరులు

భారత తొలి మహిళ ప్రధాని ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆమె జయంతిని పురస్కరించుకుని మంగళవారం అన్ని మండల కేంద్రాల్లోను ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు.



దుబ్బాకటౌన్: ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అనంతుల శ్రీనివాస్ తదితరులు



మద్దూరు(హుస్నాబాద్): మద్దూరులో..

సంక్షిప్త వార్తలు

◆ సీఎం రేవంత్ క్రికెట్ టోర్నీ షురూ

సిద్దిపేటజోన్: స్థానిక క్రికెట్ స్టేడియంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మొదటి రోజు పోటీలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు టాస్ వేసి ప్రారంభించారు. వంద రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో 280 జట్లు తలపడనున్నాయి.

◆ బీఆర్‌ఎస్ నేతగా వ్యవహరించడం తగదు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ హోదాలో ఉన్న బక్కి వెంకటయ్య బీఆర్‌ఎస్ నాయకుడిగా వ్యవహరించడం సరికాదని, ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్ హితువు పలికారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గం లగచర్ల ఘటనను లంబాడీలకు ఆపాదించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొనే ప్రతి కార్యక్రమంలో ఆయన పాల్గొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు మల్లేశం, వెంకటేశం, సురేందర్‌రెడ్డి, నరేశ్, జగన్, బాల్‌రాజు, నర్సింహులు, రమేశ్ పాల్గొన్నారు.

◆ అథ్లెటిక్స్ పరిశీలకుడుగా స్వామి

సిద్దిపేటజోన్: రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల పరిశీలకుడిగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ స్వామి వ్యవహరించనున్నారు. 20న హన్మకొండలో జరగనున్న అండర్-17 రాష్ట్రస్థాయి పోటీలకు పరిశీలకుడిగా ఆయనకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా క్రీడా సంఘాల ప్రతినిధులు రాజిరెడ్డి, సౌందర్య, పరమేశ్వర్, రామేశ్వర్ రెడ్డి, అశోక్ ఆయనను మంగళవారం అభినందించారు.

◆ ఆలయ నిర్మాణానికి రూ.3లక్షలు విరాళం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్లలో నిర్మిస్తున్న మహాలింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పందిల్ల కాటన్ మిల్లు యాజమానులు మంగళవారం రూ.3లక్షల విరాళం అందించినట్లు మాజీ సర్పంచ్ తోడేటి రమేశ్ తెలిపారు. మహాశివరాత్రి నాటికి పనులు పూర్తిచేసి ఉత్సవాలను జరిపించనున్నట్లు చెప్పారు.

◆ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



హుస్నాబాద్: ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తితో మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈఓ బండారి మనీల పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ సాహసీ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు ఆత్మసంరక్షణ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు ఆత్మరక్షణ నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఏబీవీపీ రాష్ట్ర నేత ఆదిత్య, కరాటే మాస్టర్ రమేశ్, రాకేశ్, రాజేశ్, చరణ్, సాహితి తదితరులు పాల్గొన్నారు.

◆ సీపీఎం మండల కార్యదర్శిగా రాజు

మద్దూరు(హుస్నాబాద్): సీపీఎం దూళ్మిట్ట మండల నూతన కార్యదర్శిగా జాలపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి రాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారని పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన మహాసభలో మండల కార్యదర్శితో పాటు నూతన కమిటీని నియమించారు.

◆ తడి, పొడి చెత్తను వేరు చేయండి

నంగునూరు(సిద్దిపేట): గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా మార్చి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని డీపీఓ దేవకీదేవి సూచించారు. మంగళవారం పాలమాకులలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. నర్సరీలో మునగచెట్లతో పాటు పలు రకాల చెట్లు చక్కగా పెరిగాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రభాకర్‌రావు, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

◆ కొండపోచమ్మ వార్షికోత్సవాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ నర్సాపూర్ సమీపంలో కొండపోచమ్మ ఆలయం 23వ వార్షికోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభమై 22న ముగుస్తాయని, అందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని ఈఓ రవికుమార్ తెలిపారు.

◆ కాలువ పనులు పరిశీలన

దుబ్బాకరూరల్: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామంలో జరుగుతున్న కాలువ పనులను ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించామని, పరిహారం అందని రైతుల వివరాలు కూడా సేకరిస్తున్నామని తెలిపారు.